

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 20 | జూలై, 2023 | సంచిక : 2

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**
రెండు సంవత్సరాలకు చందా..రూ॥200/-
10 సం.రాలకు చందా....... రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565

Online Donations :
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** | **పుట సంఖ్య**

మా వాణి ........ 2
కుటుంబాన్ని దేవాలయంగా........ 6
శాశ్వత ధర్మగోప్త ........ 9
సాయిభక్త దాసగణు ........ 12
శ్రీ సాయి నిత్య పారాయణ ........ 15
యోగ వ్యవస్థాపకుడే రాజు ........ 17
సన్యాసి ఆకలి ........ 19
వారసత్వం ........ 20
బాలవాణి-నీలోనే అంతా........ 24
గురుపూర్ణిమోత్సవం ........ 27
మాతృసంస్థ కబుర్లు ........ 30


ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



ఆవేళ ఆషాఢ శుద్ధ పూర్ణిమ. తన దగ్గరకు హారతివ్వడానికి వచ్చిన భక్తుల వైపు చూచారు సాయిబాబా. "ఈవేళ గురుపూర్ణిమరా! ఇదిగో ఈ స్తంభాన్ని గురువుగా భావించి పూజ చేసుకోండి" అన్నారు. "మా గురువు మా ఎదురుగా ఉంటే ఈ స్తంభాన్నెందుకు పూజించాలి" అంటూ సాయినాథుల వారికే పూజ ప్రారంభించారు భక్తులు. నాటి నుండి గురుపూర్ణిమ సాయిభక్తుల ముఖ్య ఉత్సవాలలో ఒకటిగా నిలచిపోయింది. ప్రపంచానికి ఆదిగురువు భగవంతుడు. అందుకే "నారాయణ సమారంభాం..." అంటాం. ఆ తరువాత తన అంశతో ఎందరెందరో గురువులను, తత్వవేత్తలను భూమి మీదికి పంపుతూ వస్తున్నారు ఆ పరమప్రభువు. బాబా చరిత్రలోనే స్వయంగా బాబా వారే నానాసాహెబ్ చందోర్కర్‌కు వ్యాఖ్యానించి చెప్పిన ఒక గీతాశ్లోకం ఉన్నది.

"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్వ దర్శనః" - గురువుకు శిష్యుడు నమస్కరించాలి. ఎలాగ? తన తనువు, మనస్సు సర్వస్వాన్ని ఆయనకు సమర్పిస్తున్నానన్న భావంతో సాష్టాంగంగా నమస్కరించాలి. అందులో వినయం, సమర్పణ తప్ప ఎటువంటి కాంక్ష, ఆడంబరం ఉండకూడదు - తాను నేల మీద పడటం కాదు, తన అహం నేలకూలాలి - అదీ సంగతి. శిష్యులు గురువును సేవించాలి. ఎలాగ? సమయం ఉన్నప్పుడు-అంటే మా లౌకిక వ్యవహారాల మధ్య నుండి ఎప్పుడన్నా కాస్త ఖాళీ దొరికితే మా కిష్టం వచ్చిన తీరులో-అన్నట్లు కాదు. సర్వకాల సర్వావస్థలలోనూ కింకర భావంతో అంటే సేవక భావంతో "ఇంకా ఏం చేయగలను ఇంకా ఏం చేయగలను" అని

ప్రశ్నించుకుంటూ పని వెతుక్కుంటూ సేవించగలవాడే అచ్చమైన శిష్యుడు. ఈ సేవ కూడా నాలుగు రకాలని పెద్దలు చెప్పారు. తనూ సేవ-గురువు శరీరానికి కావలసిన సేవ (భోజనాదికాలు సమర్పించడం, కాళ్లు నొక్కటం వంటివి). స్థలసేవ-గురువు యొక్క ఆశ్రమాన్ని (ఆశ్రమం అన్నది గురువు మనస్సుకు ప్రతిబింబమే కనుక) చక్కగా నడపడం, కావలసిన సేవ చేయటం. ఆసన సేవ-గురువుగారి పూజాదికాలకు, ధ్యానానికి కావలసిన సేవ చేస్తూ ఏ విధమైన అంతరాయాలూ కలుగకుండా చూడటం. ఇక చివరిది భావసేవ - గురువుతత్వాన్ని, వారు బోధించిన లక్ష్యార్థాన్ని అవగాహన చేసుకొని, మనస్సులో నిలుపుకొని నిరంతరం దాన్ని సాధించడం కోసమే జీవించడం.

ఈ నాలుగు విధాలైన సేవలలోనూ కాయానికి సేవ ఎందుకు? అది మామూలు శరీరమే అయినా ఒకానొక మహత్తర శక్తిని, దైవీశక్తిని మోస్తున్నది కనుక ఆ తనువును సేవించాలి. కానీ, తనువన్నది ఎన్నటికైనా నశించిపోయేదే కనుక ఆ సేవ సర్వోత్కృష్టమైనది కాదు. రెండవది, మూడవది కూడా దాదాపు అలాంటివే. కానీ, ఆ చివరిది మాత్రం గురువుని శాశ్వతుడిని చేసే అవకాశం ఉంటుంది. ఎలాగంటే వివేకానందుని భావసేవ ద్వారా రామకృష్ణ పరమహంస కీర్తిలోకంలో స్థిరమైపోయినట్లు. గురువులు శక్తివంతులే. కానీ, వారి శక్తి అందరికీ అర్థమయ్యేలా వ్యాపింపజేసి సామాన్యులకు కూడా అందుబాటులోకి తేవడం శిష్యుని భావసేవ ద్వారా జరుగుతుంది. అందుచేత అది సర్వశ్రేష్టమైనది అని పెద్దలు చెప్పారు. శిష్యుడు ప్రశ్నించాలి. తన సందేహాలు తీర్చుకుంటూ ఉండాలి. జ్ఞానాన్ని పెంచుకుంటూ ఉండాలి. ఐతే ఈ ప్రశ్నలు ఎలా ఉండాలి. కొంటెతనం కోసం అడగడమో, తనకు శ్రద్ధ ఉన్నదని చుట్టూ వారూ, గురువూ భావించాలని అడగడమో, తన తెలివి ప్రదర్శించడం కోసమో అడగకూడదు. విని ఏదో కథా కాలక్షేపంలాగా





మరచిపోవడం వలన ప్రయోజనం ఉండదు. ముందు తనకు తాను తర్కించుకొని, సహ శిష్యులతో చర్చించి, స్వాధ్యాయం చేసి అప్పటికీ తేలకపోతే గురువును అడగాలి. విన్నదాన్ని జాగ్రత్తగా మననం చేసుకొని ఆచరణలోకి తెచ్చుకోవాలి అప్పడే అది పరిప్రశ్న అవుతుంది.

అలా నమస్కారాలు, ప్రశ్నోత్తరాలూ, సేవ అంతా అయిపోయాక కానీ గురువు తత్వం చెప్పరు. శ్రీకృష్ణుడు తాను స్వయంగా చెప్పకుండా తత్వదర్శులైన జ్ఞానుల నుండి బోధ స్వీకరించమని అర్జునునికి చెప్పాడు. ఎందుచేతనంటే యోగులంతా భగవత్స్వరూపాలే కనుక. ఎవరు అచ్చపు యోగి అని ఎలా తెలుసుకోవడం? ఇది మరొకప్రశ్న. తాను చెప్పే దానికి, చేసే దానికి ఏ భేదమూ లేకుండా ఉన్నవాడే అచ్చమైన యోగి అని మా గురుదేవులు చెపుతూ ఉంటారు. సరే గురువుల సంగతలా ఉంచి మనం శిష్యుల సంగతి చూద్దాం. సాయి సచ్చరిత్రలో ముగ్గురు శిష్యులు కనిపిస్తారు ఒకే అధ్యాయంలో. ఒక మేకను నరకమని ఆజ్ఞ వచ్చింది బాబా వారి నుండి. ఎప్పటినుంచో బాబా దగ్గర ఉండి, ఎంతో సన్నిహితుడైన బడేబాబా ఎందుకులెద్దూ చంపడం అనుకొని ఆ విషయం వదిలేశాడు. శ్యామా పరుగున వెళ్లి కత్తి తెచ్చాడు కానీ దాని సొంతదారు ఆ కత్తి తిరిగి తీసేసుకోటంతో ఇంకోటి తెస్తానని వెళ్లాడు కానీ తాత్సారం చేసాడు. గురువు ఆజ్ఞను వెంటనే పాటించలేకపోయాడు. ఇక మూడోవాడైన దీక్షిత్ కత్తి తెచ్చి ఎత్తి పట్టుకొని మేకను చంపడానికి సిద్ధమయ్యాడు. బ్రాహ్మణుడివై పుట్టి ఈ చంపడం ఏమిటయ్యా? అంటే "అది మంచో చెడో నాకనవసరం. మీరు చెప్పారు. నేను చేస్తాను. మీ మాట నాకు శాసనం అన్నాడు. అది ఉత్తమ శిష్యుని లక్షణం. ఆ పని సత్ఫలితాన్ని ఇస్తుందా లేదా అని కానీ, తనకు పాపమా, పుణ్యమా అని కానీ ఆలోచించలేదతడు.

ఇక మహాభారతంలో మనకు నలుగురు శిష్యులు కనిపిస్తారు ప్రధానంగా. ఏకలవ్యుడు ద్రోణుడిని తన గురువుగా స్వీకరించాడు.

స్వీకరించాడనటం కన్నా భావించాడనటం బాగుంటుంది. ఆ భావనతోనే స్వయం శిక్షకుడై, తనంతట తానే ఎంతో శ్రమించి, అద్భుతమైన విలుకాడుగా తయారైనాడు. నిజానికి ఆయనకు ద్రోణుడు నేర్పిందేమీ లేదు. కానీ, ఆయన వచ్చి నాకు గురుదక్షిణగా నీ బొటనవ్రేలు ఇమ్మని అడిగినపుడు ఏకలవ్యుడు ఏ మాత్రం సంకోచించలేదు. ఆ వేలు పోతే తానిక ధనస్సు పట్టలేనని తెలుసు. మహావీరుడైన తన జీవితం వృధా అయిపోతుందని కూడా తెలుసు. గురువు ఈ కోరిక వెనుక అర్జునుని అసూయ ఉన్నదన్న అనుమానం కూడా కలిగే ఉండవచ్చు. అయినాగానీ ఏకలవ్యుడు గురుదక్షిణ ఇవ్వడంలో ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయలేదు. రెండవవాడు కర్ణుడు. ఇతనికి ధనుర్విద్య పట్ల ఆసక్తి ఉంది. కానీ, కులం రీత్యా ఆనాటి సంప్రదాయం ప్రకారం, తాము పెట్టుకొన్న నియమాల ప్రకారం ద్రోణాచార్యుడు, పరశురాముడు కూడా అతనికి విద్య నేర్పనన్నారు. కానీ, తనకున్న విద్యానురాగాన్ని వదులుకోలేక కర్ణుడు తాను బ్రాహ్మణ కుమారుడనని చెప్పకొని పరశురాముని దగ్గర శుశ్రూష చేసాడు. అతడి గురుభక్తి ఏ స్థాయికి చేరిందంటే తన తొడను కుమ్మరి పురుగు కుట్టి కన్నం పడి రక్త ధారలు ప్రవహిస్తున్నప్పటికీ తన కాలిపై పడుకొన్న గురువుకు నిద్రాభంగం చేయడం ఇష్టం లేక ఆ బాధంతటినీ నిశ్శబ్దంగా భరించాడు. కానీ, గురువుకు అసత్యం చెప్పిన దోషానికి గురువు చేత శాపం పొందాడు. మూడవవాడు అర్జునుడు. గురువు చూపిన లక్ష్యంవైపు ఎంతగా శ్రద్ధ చూపాడంటే అది తప్ప తన కంటికి మరేమీ కనపడలేదు. అంతటి ఏక దీక్షతో విద్య నేర్చి మహా వీరాధివీరుడైనాడు. గురుదక్షిణగా ద్రుపదుని పట్టి బంధించి తెచ్చి సమర్పించుకొన్నాడు. గురువుతోనే యుద్ధం చేయక తప్పని పరిస్థితులలో ఆ గురువుకు నమస్కార బాణం వేసి మరీ తన వినయం చాటుకున్నాడు. నాల్గవ వాడు దుర్యోధనుడు. విలువిద్యా గురువైన ద్రోణుని ఎన్నోసార్లు తిరస్కారంగా మాట్లాడాడు. మనస్సు





కష్టపెట్టాడు. చివరకు ఆయన ఎంతో బాధపడి "నాయనా! నేను బ్రాహ్మణ పుట్టుక పుట్టి కూడా, అధర్మం అని తెలిసి కూడా నీవైపే నిలబడి కుక్షిగత జీవనుడనై బ్రతికాను. ఆ పాపానికి నన్ను ఎన్నైనా అనవచ్చు" అని క్రుంగి పోవలసివచ్చింది. ఇవన్నీ చదివాక-"మనం ఎలాంటి శిష్యులం" అనేది ఆత్మవిచారం చేసుకోవాలి. ఎలా ఉండాలో నిర్ణయించుకోవాలి.

చివరిగా ఒక్కమాట. మనం గురువులు ఎలా ఉండాలో తర్కించటం మాని, శిష్యులుగా ఎలా ఉండాలో నేర్చుకుందాం. మనం ఎందరు గురువులనైనా దర్శించుకోవచ్చు. కానీ, మన గురి మాత్రం గురువు మీదనే నిలిపి ఉంచుకోవాలి. మన గురువు చెప్పిన దానికి వ్యతిరేకంగా ఉన్న బోధ జరుగుతున్న చోటికి పదేపదే వెళ్లి, మనసులో లేనిపోని సందేహాలు కలిగి, ఆ ఘర్షణ వలన ఏకాగ్రత దెబ్బతిని, సాధన పాడైపోయే దశకు రాకుండా చూచుకోవటం అవసరం.

# కుటుంబాన్ని దేవాలయంగా మార్చుకో

**రచన : వై.రాఘవులు**

ఇల్లు అంటే సిమెంటు, ఇటుకల కట్టడంగా మాత్రమే కాకూడదు. ఆ ఇల్లు ప్రేమ, ఆత్మీయత, సేవా, సంస్కారాల మందిరంగా మారాలి.

కుటుంబాన్ని దేవాలయంగా మార్చుకోవాలి. అందుకే ప్రతి రోజూ దేవాలయ దర్శనం చేసుకొని స్ఫూర్తి పొందాలి.

దేవాలయంలో - దేవుడు స్థిరంగా నవ్వుతూ ఉంటాడు. అంటే మనం కూడా ఆనందంగా ఎప్పుడూ సంతోషంగా ఉండాలి. కాలం మారుతుంది. ఏవో సమస్యలు గుర్తు తెచ్చుకొని బాధపడవద్దు.

**గంటానాదం :** ఎప్పుడూ ఓంకారం మనసులో ఉచ్ఛరించుకోవడం వల్ల శరీరంలోని అన్ని గ్రంథులు చైతన్యవంతం అవుతుంటాయి. రోగ

నిరోధక శక్తి పెరుగుతుంది.

**స్వచ్ఛత :** ఇంటిలో స్వచ్ఛత పాటించడం ఆరోగ్యానికి ఆధారం. ఈ విషయాన్ని అందరం అంతటా ఎల్లప్పుడూ పాటించాలి.

**మంత్రాలు :** మంచి దైవభక్తి గల గీతాలు ప్రజలకు నిరంతరం వినిపించాలి. ఈ జగత్తు శబ్ద జగత్తు. ఏ శబ్దం వల్ల ఉత్సాహం, భక్తి నిర్మాణం కలుగుతుందో అవి వినిపించాలి. అలనాడు ప్రహ్లాదుడు నారద ఆశ్రమంలో విన్న శబ్దాలు, చూసిన దృశ్యాలు, అతనిని దైవంగా మార్చాయి.

**సమరసత :** దేవాలయాల్లో అందరం భక్తి కేంద్రంగా కలుస్తాము. అదే విధంగా ఇంటిలో మన పూర్వుల ప్రతిష్ట, పరంపర, గౌరవం నిలబెట్టే వాళ్లంగా కలిసిమెలసి ఆనందంగా జీవించాలి. 10 మందికి సహకరించే వారిగా తయారవ్వాలి. (భగవాన్ శివుని కుటుంబ సభ్యుల వాహనములు సింహం, ఎద్దు, నెమలి, ఎలుక, పాము. ఇవి అన్నీ భిన్నమైన స్వభావాలు కలిగి ఉన్నప్పటికీ కేవలం 'భక్తి' కేంద్రంగా కలిసి ఒకే కుటుంబంలో జీవించాయి).

**ప్రేమ :** దేవుడు ప్రేమతో సమాజాన్ని సద్గుణవంతులుగా జీవించమని సందేశం ఇస్తాడు. ఏ దేవాలయానికి వెళ్లినా ఆ దేవుని గుణగణాలు, శౌర్య పరాక్రమాలు తెలుసుకోవాలి. వారిలా మనం తయారయే ప్రయత్నం చేయాలి. "శివం భూత్వా శివం యజేత్" అంటే 'శివుణ్ణి పూజించాలంటే శివుని గుణాలు అలవరచుకొని శివుడిగా తయారవాలి' అని అర్థం. నిజానికి అదే సరైన పూజ. అదేవిధంగా కుటుంబంలో ప్రతి ఒక్కరం పరస్పరం ఒకరికొకరు ప్రేమను పంచుకుంటూ, మనస్సు విప్పి మాట్లాడు కుంటూ, ఒకరి మంచి అనుభవాలు మరొకరికి అందిస్తూ, శక్తివంతమైన సమాజంలో ఒక అంగముగా వికసించాలి.

**శస్త్రధారి :** మనం కొలిచే ప్రతి దేవత ఏదో ఒక ఆయుధం కలిగి





ఉంటారు (శస్త్రధారి). ఆ దేవతలను కొలిచే మనం వారిలాగే ధైర్యవంతులుగా ఉండాలి. ఏదో ఒక శస్త్రాన్ని అభ్యాసం చేస్తుండాలి. ఆరోగ్యంగా శక్తివంతంగా ఉండడం నేర్చుకోవాలి.

**తీర్థ ప్రసాదాలు :** మనం తీసుకునే అన్నపానీయాలు ఆరోగ్యవంతంగా ఉండాలి. తీర్థం 24 రకాల ఓషధులు కలిగి ఉంటుంది. పంచగవ్యం, పంచఘృతం, పంచామృతం, తులసి, కర్పూరం, ఇత్యాదివన్నీ ఆరోగ్య మందించే ఔషధాలు. అందుకే "అకాలమృత్యు హరణం, సర్వవ్యాధి నివారణం" అంటూ మనకు తీర్థం ఇస్తారు. అదే విధంగా ప్రసాదం ఏరోజు కారోజు శుభ్రంగా తయారు చేసుకొని తినాలి. "యుక్తాహార విహారస్య" అన్న భగవద్గీత వాక్యాన్ని అనుసరించాలి.

**తిలక ధారణ :** ప్రతి దేవునికి తిలకం ఉంటుంది. అది ఆరోగ్యం అందిస్తుంది. దృష్టిదోషాన్ని తొలగిస్తుంది. ఆత్మ దర్శనానికి సంకేతం ఇస్తుంది. తిలకం భ్రూమధ్యం-అంటే తలలో ఉండే అన్ని నాడులకు కేంద్ర బిందువు. అందుకే వేడి ఉత్పన్నం కాకుండా సింధూరం, గంధం, తిలకం, భస్మం ఇత్యాదిని ధరించాలి. అందుకే తిలక ధారణ సంప్రదాయాన్ని హిందువులు సనాతనం నుండి పాటిస్తూనే ఉన్నారు.

**కర్తవ్యబోధ :** ప్రతి ఒక్కరం తమ తమ ధర్మాన్ని ఆచరించాలి. మనకు సహాయం చేసే వారిని సంరక్షించుకోవాలి. పంచభూతాలు మన శరీరంలో ఉన్నాయి. అవే బయటా ఉన్నాయి. అందుకే 'యత్ పిండే తత్ బ్రహ్మాండే' అంటాము. దేవతలందరూ అలాంటివారే. సంపదనిచ్చేవారు, బుద్ధి నిచ్చేవారు, శక్తినిచ్చేవారు. దేవుడు మనకిచ్చిన శక్తిని, బుద్ధిని, సంపదను అవిలేని వారికి సేవా భావంతో అందించాలి, వారిని రక్షించాలి. ఈ సృష్టిలో మానవునిగా ఇదే మన కర్తవ్యం.

**శ్రీ కృష్ణావతారం**

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

రుక్మిణికి అర్జునుని స్థితి నవ్వు తెప్పించింది.

'ఏమి యతివరా! నా సేవలు మీకు నచ్చడం లేదనుకుంటాను' అన్నది.

'అది గాదు తల్లీ! సుభద్ర రాకపోవడానికి కారణ మేమిటానని ....'

రుక్మిణి నిట్టూర్చి, 'అదా! ఆమె అస్వస్థురాలైంది. అన్నం తినదు. నిద్రపోదు. ఎప్పుడూ నిట్టూరుస్తుంటుంది. చతురులైన భిషక్కులకు కూడా ఆమె స్థితికి కారణమేమిటో తెలియడం లేదు' అన్నది మర్మంగా.

'అయ్యో! పాపం' అర్జునుని గుండెలో గుబులు ప్రవేశించింది.

దేవకీ వసుదేవులకు, రేవతీ బలరాములకు, సుభద్ర స్థితి చింతా జనకం అయింది. కృష్ణ, బలరాములను, గర్గాచార్యులను సంప్రదించారు. గర్గాచార్యులకు సుభద్రార్జునుల పరస్పర ఆకర్షణను గురించి కృష్ణుడు ముందుగానే తెలియజేశాడు.

'గురువర్యా! అన్నగారు స్తోత్రప్రియుడూ, మైరేయ మధుపాయి- ఆయనను దుర్యోధనుడు మాయమాటలతో, స్తోత్రపాఠాలలో మెప్పించాడు. సుభద్రను వివాహం చేసుకుంటే యాదవ, కౌరవ కూటమి ప్రపంచంలో అజేయమై నిలుస్తుందనీ, తాను నిరంకుశ రాజశాసనాన్ని సర్వత్రా వ్యాపించచేయవచ్చుననే విశ్వాసంతో అతడీ పన్నాగానికి పూనుకున్నాడు'.

'మరి బలరామునికి ఈ విషయం తెలియదా?'

'బలరామన్ననుగురించి మీకు ప్రత్యేకంగా తెలపాలా గురుదేవా! ఆయన సాక్షాదనంతుడు. పిచ్చిచేష్టలు చేస్తే తన హలంతో కౌరవగళాలను ఉత్తరిస్తానంటాడు. అంతే కాని వ్యవహార సత్యాన్ని, ధర్మపక్షాన్ని, ఆతతాయుల దుర్మార్గాన్ని విశ్లేషించి, వారిని అరికట్టే విధానాలను నిదానంగా ఆలో





చించే స్వభావామే కాదాయనది'.

'మరి ఎలా చేయడం'.

'ఒక్క సుగుణం ఉన్నది. ఆయనకు నా మీద అపారమైన ప్రేమ, విశ్వాసం ఉన్నాయి. అవి అనన్యమైనవి. ముందు భగ్గుమని మంటలు రేపినా, తరువాత అమృతాన్ని వర్షిస్తాడాయన. కనుక ఉపాయం ఆలోచించాలి'.

'నీవే ఆలోచించి చెప్పవయ్యా'.

'రేపు మీరు మన సౌధానికి విచ్చేయండి. సుభద్రానాశీర్వదించడం. ఆమె ఆరోగ్యానికి ప్రభాసంలో అభిషేకాదులు చేయించమనండి. నేనే స్వయంగా నిర్వహిస్తానని చెప్పండి. తరువాత విషయం నేను చూచు కుంటాను. సుభద్ర రానవసరం లేదనీ చెప్పండి'.

'కృష్ణయ్యా! నీ లీలలు విచిత్రంగా ఉంటాయయ్యా' గర్గుని కనులలో మెప్పులు మెరిసాయి.

❖ ❖ ❖

'ఓ ముద్దు చెల్లీ! జాగ్రత్తగా విను. మేమందరం ప్రభాసకు వెళ్తున్నాము. నీవిక్కడే ఉంటావు. నేటికి పన్నెండో రోజు శుభ ముహూర్తం. ఆనాటితో అర్జునుని ఒక సంవత్సరం చేయవలసిన తీర్థయాత్రాకాలపు గడువు తీరు తుంది. ఆ రోజున నీ పెండ్లి అంటూ నెత్తిన మొట్టి, బుగ్గలు తడిమి శ్రీకృష్ణుడు సుభద్రను దీవిస్తూ, 'అర్జునుడు అంటే భరత వంశ ప్రతాపాగ్ని శిఖ. జాగ్రత్త సుమీ' అని నవ్వుతూ తలను మూర్కొన్నాడు.

అర్జునుడు వెంటనే ఇంద్రప్రస్థానానికి ధర్మరాజు వద్దకు కబురు పంపి, ఆయన అనుమతిని, కుంతీదేవి అనుమతిని కోరాడు. అప్పడే మిగతా వారికి తెలుపవద్దని కూడా చెప్పాడు. త్వరలోనే ఇంద్రప్రస్థం నుండి అనుమతి లభించింది.

దేవకి, వసుదేవుడు, బలరామ దంపతులు, కృష్ణుడూ సపరివారంగా ప్రభాసకు వెళ్లారు. పన్నెండు రోజులు గడిచాయి. ఉదయమే సూర్యుడు

సప్తాశ్వరథారూఢుడై ప్రాగ్దివ్యపథాన అరుణకిరణాలతో తన అర్థాంగితోసహా ప్రకృతిని అరుణరాగాలతో నింపుతూ, వాతావరణాన్ని పులకింపజేస్తూ చరచర పైకి వస్తున్నాడు.

అర్జునుడు సుభద్రను పిలిపించి, 'మనకు వేళ అయింది. రథం సిద్ధంగా ఉన్నది. నా ధనుర్బాణాలు రథంలో అమరింపబడ్డాయి. ఆ గుర్రాలు శైబ్య, సుగ్రీవ, వలాహక, మేఘ పుష్పలు మీ అన్నవి. అవి నిలబడలేకపోతు న్నవి. మనం వెంటనే బయలుదేరాలి. నీవు కూడా శిరస్త్రాణ, కవచాలు ధరించి సిద్ధంగా రా, నాకు నీవే సారథివి' అని మొదటిసారి సుభద్ర చుబుకాన్ని స్పర్శించి, నూతన వధూ సంస్పర్శానందాన్ని కనులలో చూసాడు.

సూర్యుడు నాలుగు బారలు పైకి వచ్చాడు. అర్జునుడు నిరాచ్ఛాదిత రథం మీద నల్గురికీ తన ప్రతాప స్వరూపం కనపించేటట్లు నిల్చున్నాడు. సుభద్ర నొగల మీద కూర్చుని పగ్గాలు చేపట్టి రథాన్ని నడుపుతున్నది. రాజవీధులలో సైనికులు, యాదవ వీరులు, ద్వార పాలకులు చూస్తుం డగా రథం ముందుకు సాగింది. సుభద్రాదేవి, రాకుమారి, శ్రీకృష్ణుని ముద్దుల సోదరి అందరికీ తెలిసిందే. యాదవ యువవీరులు గదుడూ, సారణుడూ తమ సౌధోపరి భాగం నుండి అర్జునుణ్ణి గుర్తించారు. హుటా హుటిగా సైనికులతో రథాన్ని వెంబడించారు.


కాని సుభద్ర చేతి పగ్గాల కదలికలను సాక్షాత్తు తమ స్వామి కృష్ణుని ఆదేశాలుగా గుర్తించినట్లు, ఆ గుర్రాలు రథాన్ని వాయువును సవాలు చేసే వేగంతో ముందుకు దూసుకువెళ్లి, వెనుక నుంచి తరుముతూన్న బలగాలకు కనుమరుగైనాయి.

ద్వారపాలకుడు వెంటనే ఈ విషయాన్ని నగరపాలకునికి నివేదిం చాడు. 'పాండవ మధ్యముడు అర్జునుడు, మన సుభద్రమ్మగారిని తీసుకొని వెళ్లిపోయాడు. మేము వారిని వెంబడించినా పట్టుకోలేకపోయినాము.

**(సశేషం)**







# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

**(గత సంచిక తరువాయి)**

మిగిలిన ఏ గ్రంథాలు లేకపోయినా, కేవలం ఈశావాస్యోపనిషత్తులోని 18 శ్లోకాలను ఆధారంగా చేసుకొని మొత్తం హిందూధర్మాన్ని పునర్నిర్మించ వచ్చని మహాత్మాగాంధీగారు అభిప్రాయపడుతారు. కాబట్టి, అంతటి విస్తార మైన పారమార్థిక పరిజ్ఞానాన్ని బోధించే ఆ శ్లోకాలలోని భావ సంక్లిష్టతను మనం సులభంగానే ఊహించవచ్చు. విరళమైన ఆ జ్ఞానాన్ని, సరళమైన పదాలలో స్పష్టీకరించడం అంటే, ఎంతటి అసామాన్యమైన ప్రయత్నమో మనం అర్థం చేసుకోవచ్చు. కానీ, మొరలిడినంతనే వరములనొసగెడి సగుణ సాకార పరబ్రహ్మ, సమర్థ సద్గురు సామ్రాట్టు అయిన శ్రీ సాయి కృపాకటాక్ష వీక్షణాలు వసంత వీచికలై భావ దుర్బోధతతో తప్తుడైన దాస గణుకి స్వాంతన చేకూరుస్తుంటే ఇక సంక్లిష్టతకు తావు ఎక్కడుంటుంది? మనసును గందరగోళానికి గురిచేసిన నిగూఢతంతా అదృశ్యమై, భావమంతా తేటతెల్లమై, హృదయంలో చిదానంద మేఘం వర్షించి, మనసు మయూరమై పురివిప్పి ఆడుతుంది.

సరిగ్గా దాసగణుకు అటువంటి అనుభవమే కలిగింది. ఈశావాస్యోప నిషత్తులోని ఒక శ్లోకంలోని భావం తనకు ఎంతకీ అవగతం కాని సందర్భంలో భక్త దయాళువు, ఘటనాఘటన సమర్థుడైన శ్రీ సాయి సంకల్పించి కల్పించిన సంఘటన ద్వారా ఆ శ్లోకాల యొక్క భావార్థాన్ని బోధించిన తీరును అద్భుతం, అపూర్వం, అమేయం, అప్రమేయం వంటి పదాలతో వర్ణించుదామని ఈ కలం ప్రయత్నం చేస్తే ఆ పదాలు తమ అశక్తతను వ్యక్తం చేస్తూ, చిన్నబోయి పక్కకు తప్పకుంటున్నాయి. కానీ, సాయి స్మరణ కోసం పరితపిస్తున్న కలం శ్రీ సాయి లీలలను అక్షరబద్ధం

చేయాలనే సత్సంకల్పంతో పట్టువదలక తేట పదాల సహాయంతో వర్ణిం చాలనే తాపత్రయాన్ని పాఠక దేవుళ్ళు పెద్ద మనసుతో అర్థం చేసుకొని, ఆశీర్వదించవలసినదిగా ప్రార్థన. అవధరించండి!

దాసగణు ఈశావాస్యోపనిషత్తు శ్లోకాలపై భావార్థాన్ని వ్రాయడానికి ఉపక్రమించినప్పుడు, ఆదిలోనే హంసపాదు అన్నట్లు మొదటి శ్లోకంలోని కొన్ని పదాలలోని గూఢార్థం తనకు ఒక పట్టాన అంతుబట్టలేదు. ఆ శ్లోకం ఏమిటంటే ...

ఈశావాశ్య మిదం సర్వం, యత్ కించిత్ జగత్యాం జగత్ ।

తేన త్యక్తేన భుంజిథాః, మాగృధః కస్య స్విద్ధనం ॥

(భావం :- ప్రపంచంలోని చరచరాలలో ఈశ్వరుడే నిండియున్నాడు. కనుక, త్యాగం చేసి అనుభవించు, ఇతరుల ధనాన్ని ఆశించవద్దు)

పై శ్లోకంలో త్యక్తేన భుంజిథాః (త్యక్తేన = త్యాగం చేసి, భుంజిథాః= అనుభవించు) అనే పదాలలోని గూఢార్థం ఏమిటో దాసగణుకు ఎంత ప్రయత్నించినా బోధపడలేదు. త్యాగం చేసి అనుభవించడం ఎలా వీలవు తుందో దాసగణుకి అసలు అర్థం కాలేదు. త్యాగం, అనుభవించడం అనేవి పరస్పర విరుద్ధమైన భావాలు కలిగిన పదాలు! మరి ఆ రెండు పదాలు కలిసి అందించే భావమేమిటో ఎంత చింతన చేసినా మనసుకు చిక్కడం లేదు. మనం దేన్నయినా కలిగియున్నప్పుడే కదా అనుభవించగలం! సర్వం త్యాగం చేసాక ఇక అనుభవించడానికి ఏముంటుంది? మరటువం టప్పుడు త్యాగం చేసి అనుభవించమని చెప్పడంలో అంతరార్థం ఏమిటి? అని ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా ఆ వాక్యంలోని రహస్యం అంతు చిక్కలేదు. ప్రతిరోజు గంటలు గంటలు అదే విషయం గురించి చింతన చేయసాగాడు. సందేహ నివృత్తి కోసమై కొందరు సంస్కృత పండితులను, సాధు పురుషులను, ప్రవచనకారులను కలిసి ఈ విషయం గురించి చర్చించారు. కానీ, ఎక్కడా సరయిన సమాధానం లభించలేదు. మొదటి





శ్లోకంలోనే అటువంటి క్లిష్ట పరిస్థితి ఎదురుకావడంతో దాసగణుకు ఎంతో నిరుత్సాహంగా అనిపించి, మనసు చాలా వేదనకు లోనయింది.

“ఈశ్వర తత్వానికి సంబంధించిన సంక్లిష్టమైన ఈ శ్లోకంలోని నిగూఢతను, ఆ ఈశ్వర తత్వానికి సగుణ సాకార రూపమైన సద్గురు సాయి మాత్రమే వివరించగలరు” అని భావించి శిరిడీ వెళ్లి బాబా దర్శనం చేసుకున్నాడు. బాబా చరణాలపై శిరస్సు నుంచి, నమస్కరించుకొని, అక్కడే కూర్చొని బాబా చరణాలను మర్దించసాగాడు. అప్పుడు బాబా, దాసగణును కుశలప్రశ్నలు వేస్తూ, నర్మగర్భంగా **“కాయ్ గణూ సకళ ఠీక్ ఆహేనా (ఏం గణు అంతా బాగానే ఉంది కదా)”** అని అడిగారు.

“బాబా, మీ కృపాదృష్టి నాపై యుండగా, ఇక బాగా లేనిది అంటూ ఏముంటుంది? అయినా మీరు ఈ ప్రశ్న ఎందుకు వేసారో నాకు తెలుసు” అని సమాధానమిస్తూ, తన యొక్క సందేహాన్ని బాబాకు నివేదించాడు.

అప్పుడు బాబా **“అందులో ఏముందిరా గణు? సరే, నీవు ఇక్కడ నుండి ఎక్కడకు వెళతావు?”** అని అడిగారు.

“విల్లేపార్లే లోని కాకాసాహెబ్ దీక్షిత్ ఇంటికి వెళుతున్నాను” అని దాసగణు సమాధానం ఇచ్చాడు.

**“సరే అయితే! అక్కడ కాకా వాళ్ళ ఇంట్లోని పనిపిల్ల నీ సందేహాన్ని తీరుస్తుంది వెళ్ళు”** అని బాబా భరోసాను ఇస్తూ చెప్పారు.

అక్కడే బాబా వద్ద కూర్చొని, వారి సంభాషణనంతా వింటున్న మిగిలిన భక్తులు, బాబా మాటలు విని అవాక్కయ్యారు. దాసగణు అడిగిన నిగూఢ మైన ప్రశ్నకు సమాధానంగా బాబా బహుశః వేదాంత ఉపన్యాసం చేస్తారని ఊహించుకుంటున్న ఆ భక్తులు, బాబా మాటలు విని “ఇదెక్కడి చోద్యం” అంటూ ముక్కున వేలేసుకున్నారు. నిజానికి వారు ఆ సమయంలో అలా భావించడంలో ఆశ్చర్యం లేదు.

**(సశేషం)**

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

**(గత సంచిక తరువాయి)**

ఆ.వె. దినదినమున నీవు దీక్షతో సాయీశు
గాథలు విన భక్తి గరిమ గల్గు
సాయి దర్శనంబు సాకారమై యుండ
మోక్ష మమరజేయు మూర్తి సాయి 6

ఆ.వె. స్మరణ చేయుచుండ సాయీశు నీహృది
రాత్రి పగలు యనక రమ్యచరితు
దిటవు గలుగు మనసు దీననాథుని యందు
ఐక్యసిద్ధిబడయు నాత్మ శివుని. 7

ఆ.వె. సంతులేని చింత సంతాపమును బొంది
రతను నిన్ను వేడ రాత మారె
దక్షిణడిగి సాయి దాక్షిణ్యమును జూప
సంతసించి పొగడె సర్వు డనుచు 8

తే.గీ. రతను మౌలాకు వెచ్చించె నెంత ధనము
యెటుల తెలిసెను బాబాకు యేమివింత
మూడు కాలాలు నెఱిగెడు మూర్తి సాయి
ఆత్మ లన్నిట యతడు యమరి యుండు 9

తే.గీ. హరి వినాయక సాఠేను జేరి సాయి,
భార్య మరణించ కుందెడు వాని మరల





పెండ్లి యాడుమీవు, కలుగు పిల్లలనుచు
సాంత్వనము పల్క నిజమయ్యె సాయి వాక్కు 10

కం. అందరి నడుగడు దక్షిణ
కొందరు యిచ్చిన వలదని కోపముజేయున్
ఎందరో బీదలు లేదన
నెందరి నడిగైన యిమ్ము యేమరుకుండన్ 11

తే.గీ. వేద వాక్కిది కానుక వేయ గుడిన
రాజుకు బహుమతియు, మహరాజ సాధు
సంతులకు దక్షిణ లొసగ, సమ్మతిగన
మనుచు ధర్మ సమ్మతమని యనగ వినమె 12

ఆ.వె. కాంచనమును వీడ కష్టతరమగును
దాని నభ్యసించ దానమిడుము
దాన మిడగ నీకు దాక్షిణ్య మలవడు
నాదనియెడు భావ మంతరించు 13

తే.గీ. ఆత్మ కథలోన గణపతి - యనుభవమ్ము
వ్రాసి కొనియెను - మరిమరి బాబసాయి
యడుగ ధనపు సంచి నిడుట- యదియ మొదలు
ధనపు కొఱత లేదెపుడును - ధన్యుడయితి 14

తే.గీ. ఆరు రూపాయ లడుగ లేదారు యనుచు
పలికె తర్ఖడు భార్యయు - భావమెద్ది
యనగ షడ్ దుర్గుణములంచు యామెభర్త
విశద బరచె, సాయి యడుగు విధము గనుము 15

**(సశేషం)**

# యోగ్య వ్యవస్థాపకుడే రాజు

- 'చిరుదీపాలు' నుండి

అజాతశత్రువు రాజ్యస్థాపన సందర్భంలో పెద్దఎత్తున విజయోత్సవాలను జరుపుతూ ఓనాటి రాత్రి అతి చక్కగా విందు ఏర్పాటు చేశాడు. మంత్రి సూక్ష్మబుద్ధి, సైనికదళాలను విజయపథంలో నడిపిన విక్రమసింహుడు. రాజకీయ దౌత్య వ్యవహారాలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించిన విమలమిత్రుడు ఒకచోట, మరోచోట సుమనశేఖరుడు, అతని శిష్యులు కూర్చొని ఉన్నారు.

విందు కార్యక్రమం పతాకస్థాయికి చేరిన సమయంలో సుమనశేఖరుడి శిష్యులు తమ గురువును ఒక సందేహం అడిగారు. అదేమిటంటే, 'సూక్ష్మబుద్ధి యొక్క బుద్ధి కుశలత, చిత్తశుద్ధి, వ్యూహరచనా సామర్థ్యం కారణంగా వారు కూర్చున్న స్థానం సముచితమైనదే. వారి కారణంగానే మన సైనిక దళాలకు యుద్ధ సమయంలో ఆయుధాలకు, ఆహారానికి లోటు లేకుండా అన్ని ఏర్పాట్లు జరిగాయి. అలాగే విక్రమసింహుని నాయకత్వం జగత్ప్రసిద్ధం. సైనికదళాలు ఏ సమయంలో ముందడుగు వేయాలో, ఎప్పుడు వెనక్కి వెళ్ళాలో, శత్రువును ఎలా చావుదెబ్బ తీయాలో ఆయనకు బాగా తెలుసు. దౌత్య వ్యవహారాల్లో అప్రమత్తతతో ఉంటూ, మనకు మంచి మిత్రులను సంపాదించి పెడుతూ శత్రువుని ఏకాకి చేసిన విమల మిత్రుడు అపరచాణక్యుడే. కాబట్టి వీళ్ళు కూర్చున్న స్థానాలు కూడా సముచితమైనవే. కానీ రాజు అజాతశత్రువునే చూడండి. వారికి సూక్ష్మబుద్ధికున్న బుద్ధి కుశలత లేదు. విక్రమసింహునికున్న సైనికపాటవం లేదు. విమల మిత్రునికున్న దౌత్యనిపుణత లేదు. మరి వారెందుకు చక్రవర్తి అయినట్లు? అందరి కన్నా ఉన్నతస్థానాన ఎందుకు కూర్చున్నట్లు?".

సుమన శేఖరునికి శిష్యుల సందేహం అర్థమై రథచక్రాన్ని చూశారు





గదా! రథాన్ని ముందుకురికించడంలో చక్రానికి శక్తి సమకూర్చేదేది? అనడిగారు. ఓ క్షణమాలోచించి 'చక్రపుటాకులు' అని శిష్యులు సమాధానమిచ్చారు. 'అదే అయిన పక్షంలో మరి ఒకే రకపు ఆకులతో చేసిన రెండు వేర్వేరు చక్రాల పాటవంలో తేడా ఎందుకు వస్తున్నట్లు' అనడిగిన గురువు వంక మౌనంగా చూస్తుండిపోయారు శిష్యులు.

'చక్రపుటాకులు విడివిడిగా ఎంత పటిష్ఠమైనా, వాటిని ఓ నిర్దిష్టమైన పద్ధతిలో అమర్చని పక్షంలో చక్రం నిర్వీర్యమై తీరుతుంది. చక్రమంటే అసలు ఆకుల సముదాయమేగాదు. ఆ ఆకుల మధ్యనున్న శూన్యప్రదేశం కూడా చక్రపుటాకృతిలో అంతర్భాగమే! ఆకులను సరైన రీతిలో అమర్చి వాటన్నింటి శక్తినీ సక్రమంగా సమన్వయ పరచినపుడే చక్రపు పాటవం శిఖరాగ్రం చేరగలుగుతుంది. చక్రాలను ఉత్పత్తి చేసే దారుశిల్పి నేర్పరితనమూ, ఏ ఆకును ఎంతెంతదూరంలో ఎలా అమర్చాలి అన్న విషయంలో అతని అనుభవపూర్వక నిర్ణయమూ చక్రపుటాకృతిని నిర్వచించి చక్రపు నాణ్యతను నిర్ణయిస్తాయి ఆలోచించండి. మన రాజ్యపుచక్రంలో ఆ శిల్పి ఎవరు? ఆ నిపుణుడెవరు?" అన్నాడు గురువు.

"కాని గురువర్యా! ఏ నిపుణుడైనా రథచక్రపుటాకులు తమతమ శక్తులను సమపాళ్ళలో మేళవించి, తన విడివిడి బలాలకన్నా మిన్నయైన పాటవం గల రథచక్రంగా రూపొందించడానికి ఎలా దోహదం చేస్తాడు? ఏమిటా సమన్వయ రహస్యం?" అడిగారు శిష్యులు.

"సూర్యరశ్మినే గమనించండి. వృక్షాలు ఎదగడానికి, పుష్పాలు విచ్చుకొనడానికి సూర్యుడు అన్నివేళలా దోహదం చేస్తాడు. తన శక్తిని పంచి ఇస్తాడు. ఫలితంగా చెట్లూ చేమలు సూర్యముఖంగా ఎదుగుతాయి. అలాగే అజాతశత్రువు లాంటి నాయకుడు కూడా సరైన వ్యక్తులను సరైన పదవులలో నియమించి వారి శక్తి సామర్థ్యాలు పరిపూర్ణంగా వికసించే అవకాశాలు కల్పించి, వారందరి వ్యక్తిగత శక్తులనూ ఏకోన్ముఖం చేస్తాడు. తన అనుచరులు సాధించిన ఘనకార్యాల కీర్తిప్రతిష్ఠలను పూర్తిగా వారికే

అందేలా జాగ్రత్త వహిస్తాడు. తరువులూ పూవులూ సూర్యాభిముఖంగా ఆబగా ఎలా ఎదుగుతాయో అలానే అనుచరులందరూ అంకితభావంతో అజాతశత్రువు వంటి నాయకుని దిశగా సాగడానికి ముందుకు వస్తారు. అతడి వెనుక నడుస్తాడు. కాబట్టి అజాతశత్రువు చక్రవర్తి అయ్యాడు. ఉన్నతస్థానాన కూర్చున్నాడు.

# సన్యాసి ఆకలి

**- భవాన్స్ జనరల్ నుండి**

స్వామి త్రిగుణాతీతానంద రామకృష్ణ పరమహంస శిష్యుడు. 1897లో బెంగాల్ కరువు కాలంలో ఆయన ఒక చిన్న పిల్లవాడిని వెంటబెట్టుకొని ఒక సత్రంలోకి వెళ్ళారు. అక్కడ కొద్ది డబ్బుతోనే ఎవరైనా ఎంతైనా తినవచ్చు. స్వామీజీ తన వెంట వచ్చిన పిల్లవాడు ఎక్కువ ఏమీ తినలేడు కనుక వాడికి కొంచెం తక్కువ డబ్బులు తీసుకోమని కోరారు. కానీ, సత్రం నడిపే ఆయన అందుకు ఒప్పకోలేదు. అందరికీ సమానమే పొమ్మన్నారు.

స్వామీజీ ఏమీ వాదించలేదు. ఆయన తనకు వడ్డించిన దాన్ని శుభ్రంగా తినేసి మళ్ళీ కావాలని అడిగారు. రెండవసారి వడ్డించిన దానిని కూడా పూర్తి చేసి ఇంకా తెమ్మన్నారు. అలా మూడుసార్లు అయ్యాక వడ్డించే వారికి “ఈయన గారు సత్రంలో వండింది మొత్తం తినేస్తారేమో” అనిపించింది. వారు స్వామీజీ దగ్గరకు వచ్చి పిల్లవాడికి ఏమీ డబ్బులు తీసుకోము గానీ మీరింక తినటం మానెయ్యండి స్వామీ అని ప్రార్థించారు. స్వామీజీ చిరునవ్వుతో అంగీకరించారు. 1902 సంవత్సరం స్వామీ త్రిగుణాతీతానందను శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉన్న రామకృష్ణ మిషన్‌కు కేంద్ర సంచాలకులుగా అమెరికా పంపించారు. ఆయన అక్కడ తొలి హిందూ దేవాలయాన్ని నిర్మాణం చేయించారు. 1906వ సంవత్సరంలో ప్రతిష్ఠ జరిగిన దేవాలయం ఈనాటికీ లక్షణంగా ఉంది.





# వారసత్వం

**- మాతా శుకవాణి**

లోకంలో సాధారణంగా తండ్రిని బట్టి పిల్లలను అంచనా వేస్తుంటారు. జీన్స్ అని పిలవబడే ఈ రక్తగత లక్షణాలు కొంతవరకే సత్యం. పూర్తిగా కాదు. బిడ్డ భూమిపైకి వచ్చాక చూచి నేర్చుకునేవి. విని తెలుసుకునేవి, విద్య ద్వారా, అధ్యయనం ద్వారా గ్రహించేవి అయిన ఎన్నెన్నో విషయాల ప్రభావం శిశువు మీద ఉంటుంది. పైగా తల్లిదండ్రుల లక్షణాలు మాత్రమే కాదు. మేనత్తలు, ముఖ్యంగా తల్లివైపు దగ్గరి బంధువుల లక్షణాలు కూడా శిశువుకి సంక్రమించవచ్చు. ఇవేవీ తెలియకుండా జనం గొప్పవాళ్ళ కొడుకులు గొప్పవాళ్ళే అవుతారనీ, మూర్ఖుల కొడుకులు మూర్ఖులే అవుతారనీ సిద్ధాంతీకరించడం పొరపాటు. వీటన్నింటిని మించి జీవుడు గత జన్మలలో చేసి విడిచిన సాధనా ఫలం, దైవబలం కూడ ఇతని వికాసానికి తోడ్పడవచ్చు. ఈ మాట ఎన్నడో మహాభారతకాలంలోనే అంగీకరింపబడింది. అదెలాగో చూద్దాం!

ఉద్దాలక మహర్షి దగ్గర ఓ శిష్యుడు ఉండేవాడు. అతని పేరు కహోలుడు. అతనికి నియమనిష్ఠలు, గురువు పట్ల భక్తిశ్రద్ధలు ఉన్నాయి. కానీ, విద్యాభ్యాసంలో చురుకుదనం తక్కువ. అందుకని మిత్రులంతా హేళన చేస్తూ ఉండేవారు. సరే ఎలాగో విద్యాభ్యాసం పూర్తయింది. శిష్యుడు కొంత మందబుద్ధి అయినా-ఉద్ధాలక మహర్షి వాత్సల్యంతో తన కుమార్తె సుజాతను కహోలునికిచ్చి వివాహం చేశాడు. సుజాత గర్భవతి అయింది. ఆమె గర్భంలోని శిశువు ప్రతిరోజు తాతగారు చదివే వేదం వింటూ ఉండేవాడు. ఒకరోజు అతడు తన తండ్రిగారు వేదాధ్యయనం చేయటం విన్నాడు. తండ్రి నోట వెలువడే అపస్వరాలు, అపశబ్దాలు విని భరించలేక అతని కాళ్ళు, చేతులు, శరీరం వంకరలు తిరిగిపోసాగాయి. అలా రోజూ వినివిని ఆ పిల్లవాడు ఎనిమిది వంకరలతో పుట్టాడు. అందుచేత అతనికి

అష్టావక్రుడని పేరు పెట్టారు.

ఇక్కడ మనమొక విషయం గ్రహించాలి. మనిషికి అనేక సంస్కారాలు తల్లి కడుపులో ఉన్నప్పడే సంక్రమిస్తాయి. భయం, పిరికితనం, ద్వేషం, జాలి, సంతోషం-వీటిలో చాలా వాటికి అంకురార్పణ తల్లి గర్భంలోనే జరుగుతుంది. అందుకే గర్భవతి అయిన స్త్రీని ఎవరూ బాధపెట్టకూడదనీ సీమంతం, పుంసవనం మొదలైన ఉత్సవాలతో ఆనందింపజేయాలనీ పెద్దలు చెప్తారు. అలాగే శిశువు క్రూరాత్ముడు కాకుండా ఉండాలనీ, భయ భ్రాంతులకు లోను కాకుండా ఉండాలనీ భావించి నేరాలతోను, ఘోర కృత్యాలతోను ఉండే పుస్తకాలు చదవడం, అలాంటి చిత్రాలు చూడటం వంటి వాటిని నిషేధించారు. ఇవేవీ పట్టించుకోకుండా ఉండే అధునాతన మాతలకు కలిగే సంతతి ఎలా తయారవుతుందో మనం చూస్తూనే ఉన్నాం కదా!

సరే-మన అష్టావక్రుడు బాల్యంలోనే మంచి పండితుడైనాడు. పన్నెండేళ్ళకే వేదవేదాంగ పారంగతుడై పోయాడు. ఒకరోజతనికి తన తండ్రి కహోలుడు జనక మహారాజు కొలువులోకి వెళ్లాడనీ, సహజంగా కొంచెం మందమతి  కావటం వలన అక్కడి పండితులందరూ అతన్ని హేళన చేసారనీ తెలిసింది. అంతకన్నా బాధాకరమైన విషయం ఏమిటంటే ఆ అవమానాన్ని సహించలేక కహోలుడు సముద్రంలో పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసింది. అష్టావక్రుడికి కోపం, దుఃఖం రెండూ కలిగాయి. అదే సమయంలో మిథిలానగరంలో జనక మహారాజు యజ్ఞం చేస్తున్నారనీ, ఆ సందర్భంలో వేదపండితులందరినీ రప్పించి, వేద చర్చలు చేస్తున్నారనీ విన్నాడు. అష్టావక్రుడు తన అక్క కుమారుడు సువేదకేతువును వెంట బెట్టుకొని మిథిలకు బయలుదేరాడు.

రాజభటులు అష్టావక్రుని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. అష్టావక్రుడు వాళ్లతో, "గ్రుడ్డివాళ్లూ, వికలాంగులూ, స్త్రీలూ ఎదురైతే త్రోవకు





అడ్డం తగలకూడదు. వేదపండితులు ఎదురైతే రాజైనా సరే తప్పకు పొమ్మనకూడదు" అన్నాడు. ఆ మాటలు లోపలికి జనక మహారాజుకు వినిపించాయి. ఆయన "ఆ పిల్లవాడు చెప్పింది నిజమే. నిప్పు చిన్నదైనా, పెద్దదైనా కాల్చక మానదు గదా! బ్రాహ్మణ బాలకులను లోనికి రానివ్వండి" అన్నాడు. వారు ఆవరణ దాటి యాగశాలలోకి ప్రవేశించబోతుంటే అక్కడి భటులు మళ్లీ ఆపివేశారు. "ఇక్కడికి పిల్లలు రాకూడదు. వేదం చదువుకున్న పెద్దలు మాత్రమే రావాలి" అన్నారు. అష్టావక్రుడు మేం చిన్నపిల్లలం కాదు. దీక్షగా వేదాలు నేర్వడమే కాదు. వేదాంతం కూడా అధ్యయనం చేసినవాళ్లం. జ్ఞానానికి వయస్సుతో సంబంధం లేదు. పెద్దరికం అన్నది వయస్సు వలన రాదు. విజ్ఞత వలన వస్తుంది. దారి ఇవ్వు, అయినా ద్వార పాలకుడు వదలలేదు. "ఇక్కడకు వచ్చిన విద్వాంసులందరిని చూచి వారితో వాదించాలని వచ్చాను. మీ రాజు గారికి తెలియజేయి. జనకుడు బయటకు వచ్చాడు. "మా పండితులంతా వాదం ప్రారంభిస్తే జ్ఞాన సముద్రంలో మునిగినట్లే ఉంటుంది. అటువంటి వారితో వాదించాలని నీకు కోరిక ఎందుకు కలిగింది బాలకా? ఓడిపోతే నిన్ను సముద్రంలోకి తోస్తారు. ఇష్టమేనా" అని అడిగాడు. అందుకు అష్టావక్రుడు స్థిరంగా చూస్తూ మహారాజా మీ విద్వాంసులు మహాపండితులే కావచ్చు. కానీ, అహంభావంతో ఉన్నారు. మా తండ్రిగారు వీళ్ళు చేసిన అవమానాన్ని సహించలేక సముద్రంలో దూకి మరణించారని మా అమ్మగారు చెప్పారు. నేను తండ్రి రుణం తీర్చుకోవడానికి ఇక్కడకు వచ్చాను. ఓడినవారు సముద్రంలో దూకాలనే మీ నిర్ణయాన్ని నేనంగీకరిస్తున్నాను" అన్నాడు.

అష్టావక్రుడు రాజు వెంట యాగశాలలోకి ప్రవేశించాడు. అక్కడున్న మహాపండితులందరూ అతన్ని చూచి పక్కున నవ్వారు. గిరుక్కున వెనుకకు తిరిగాడు అష్టావక్రుడు. "వెళ్లిపోతున్నావేం నాయనా అని అడిగాడు జనకుడు. "మహాప్రభూ ఇది విద్వత్సభ అనుకొని వచ్చాను. చర్మకారుల తోలుతో చెప్పలు, తోలు సామాగ్రి కుట్టేవారి సభ అని తెలియ

లేదు. అందుకే తిరిగి వెడుతున్నా" అన్నాడు. "ఏమాకావరం" అని గర్జించా డొక విద్వాంసుడు. అష్టావక్రుడు వెంటనే జవాబు ఇచ్చాడు. "మీరు నా చర్మాన్నీ, అందులోని వంకరలను మాత్రమే చూడగలిగారు కానీ నా లోపల ఏమైనా విద్వత్ ఉన్నదేమోనని ఊహించలేకపోయారు. అది చర్మకారుల పనికదా?" జనక మహారాజు పెదవులపై చిన్న చిరునవ్వు మెరసి మీసాల చాటున మాయమైంది. "ఓయీ విప్రోత్తమా మీరన్నది నిజమే. అందరి తరపున మేము మిమ్మల్ని క్షమార్పణ కోరుతున్నాము చర్చ ప్రారంభించండి" అన్నాడు.

కొమ్ములు తిరిగిన మహాపండితులందరూ తమతమ ప్రశ్నలను పదును పెట్టిన ఆయుధాల్లాగా అష్టావక్రుడిపైకి విసురుతూ వచ్చారు. కాని అతడు ఏమాత్రం చలించలేదు. స్థిరంగా నిలబడి వారందరికీ సరిఅయిన సమాధానాలు ఇచ్చాడు. అటుపైన ఆయన తన వాదాన్ని ప్రారంభించాడు. ఆయన ప్రశ్నలకు సరిఅయిన జవాబులు ఇవ్వలేక, తమ సమాధానాలపై అతడు వేసే అడ్డు ప్రశ్నలకు వివరణ చెప్పలేక అక్కడి విద్వాంసులంతా నోళ్ళు తెరిచారు. చివరికి తాము అంతా ఓడిపోయామని అష్టావక్రుడే గెలిచాడని అంగీకరించారు. పందెం ప్రకారం ఓడిన పండితులంతా సముద్రగర్భంలోకి చేరిపోయారు. అప్పుడు కహోలుడి ఆత్మ తన కుమారుని చూచి ఎంతో ఆనందించింది.

పై కథను బట్టి మనం ఒక్కటే అర్థం చేసుకోవలసింది. యోగ్యుడైన వాడికి యోగ్యుడైన వాడే పుడతాడని, అయోగ్యుడైన వాడికి అయోగ్యుడే జన్మిస్తాడని చెప్పలేము. ఎంతో దృఢ శరీరమున్నవాడికి అత్యంత బలహీను డైన పుత్రుడు ఉండవచ్చు. నిరక్షరాస్యునికి మహాపండితుడు కలగవచ్చు. ఇక పండితపుత్రః పరమశుంఠః అన్న సామెత మనం విన్నదే. మొత్తం మీద చూస్తే ఒక వ్యక్తిని వాడి జన్మనుబట్టిగాని, జాతినిబట్టిగాని, రూపాన్నిబట్టి గాని అంచనా వేయడం తప్పు. వారి వారి జన్మసుకృతం, కృషి, దైవాను గ్రహాలను బట్టి ఎన్నెన్నో శక్తులు వస్తాయి.





బాలవాణి

# నీలోనే అంత

- మాతాజీ

అనగనగా ఒక ఊళ్ళో ఒక నిరుపేదవాడుండేవాడు. అతనికి నలుగురు పిల్లలు, భార్య ఉన్నారు. అడవిలో కట్టెలు కొట్టి తెచ్చి ఊళ్లో అమ్ముకొని సంసారాన్ని పోషించుకొంటూ ఉండేవాడు. ఐతే ఒకరోజు ఓ పెద్ద చెట్టు కొమ్మ పడి అతని కాలు విరిగిపోయింది. దానితో అతనికీ, అతని భార్యా బిడ్డలకూ తిండి దొరకడం కూడా కష్టమైంది. ఏ దారీ దొరక్క కుటుంబ మంతా అలమటించిపోతున్నారు. తెలిసినవాళ్లు, ఆప్తులూ, బంధువులూ అంతో ఇంతో సాయం చేసినా ఎన్నాళ్లని గడుస్తుంది? చావలేక, బ్రతక లేక అలా ఈడ్చుకుంటూ వస్తున్నారు. నిత్యం తమ కష్ట పరిస్థితినే తలుచు కొని బాధపడుతూ ఉండేవారు ఆ కుటుంబీకులంతా.

ఇలా ఉండగా ఒకరోజు వాళ్ల ఇంటికి ఒక సాధువు వచ్చారు. తిన్నగా లోపలికి వచ్చి కూర్చొని "నాయనా! ఆకలితో వచ్చాను. భిక్ష ఇస్తావా?" అని అడిగాడు. ఆ మాట వింటూనే రంగన్న ఆయన పాదాల మీదబడి భోరున ఏడ్చాడు. "స్వామీ! నా పసిబిడ్డలు 'ఆకలి నాన్నా!' అంటే తీర్చలేని దశలో నేనున్నాను. మీ వంటి మహనీయులు స్వయంగా వచ్చి భిక్ష ఇమ్మని అడిగితే ఏమివ్వగలను? ఒకనాటితో పోయేదైతే ఎవరైనా సాయం చేస్తారు. నా దరిద్రాన్ని చూసి నా సొంత మనుషులే దూరదూరంగా తొలగిపోతున్నారు. నాకెవరూ సాయం చేసేవారు లేరు" అని మొరపెట్టు కున్నాడు. సాధువు చిన్నగా నవ్వాడు. "నువ్వు ఈ గ్రామంలోని అందరినీ ధనవంతులను చేయగలవు. అంత సంపద నీకున్నది. పేదవాడి నంటావేం?" అన్నాడు. రంగన్న ఆశ్చర్యంతో ఆయనవైపు చూస్తూ- "ఈ పూటకు గతిలేని అవిటివాడిని నేనేమిటి-ఊరందరికంటే ధనవంతుడి నేమిటి? మీరనేది నాకర్థం కావటం లేదు స్వామీ" అని అన్నాడు. సాధువు- "నీ కర్థమయ్యేలా చెప్తాను విను. ఇదుగో ఇదేమిటి?" ఒక రాతిని

చూపించి అడిగాడు. "రాయి" "మరి ఇదేమిటి?" "ఇదీ రాయే" సాధువు నవ్వాడు. "నాకిది రాతిలా కన్పించడం లేదు. మరోలా కనిపిస్తోంది" అన్నాడు.

రంగన్న అయోమయంలో పడ్డాడు. "ఎదురుగా రాయి కనిపిస్తోంటే అది రాయి కాదంటున్నారే!" దృష్టి దోషమా ఏం!" సాధువు అతని బాధ అర్థం చేసుకున్నాడు. "నాకు చూపు తక్కువనుకుంటున్నావు కదూ! నీకే రుజువు చేస్తాను. ఇది రాయి కాదని. ఈ రాతిని తీసుకొనివెళ్లి ఆ తలుపు గొళ్ళానికి తాకించు" అన్నాడు. రంగన్న అలానే చేశాడు. ఆ ఇనుప గొళ్లెం కాస్తా బంగారంగా మారిపోయింది. వెంటనే సాధువు ఆ రాతిని మరికొన్ని ఇనుప వస్తువులకు కూడా అంటించమన్నాడు. నల్లగా, తుప్పపట్టిపోయి ఉన్న ఆ వస్తువులను ధగధగలాడే బంగారు వస్తువులుగా మారిపోయాయి. రంగన్న తన కళ్లను తనే నమ్మలేకపోయాడ. "ఇప్పుడు చెప్పు ఇది రాయే నంటావా?" అని అడిగాడు సాధువు. రంగన్న తల గబగబా అడ్డంగా ఊపేసాడు. "కాదు స్వామీ! కాదు! ఇలా తాకితే బంగారాన్ని చేసే దాన్ని పరుసవేది అంటారని ఎప్పుడో విన్నాను. ఇది అదేనా స్వామీ?" అని అడిగాడు. "అవును. మరి దీన్ని నేనిప్పడు బయటినుండీ తెచ్చానా?" "లేదు-ఇది మా ఇంట్లోదే గదా!" "మరి అయితే ఇప్పుడు చెప్పు నీవు ఊరంతటినీ ధనవంతం చేయగలంత గొప్పవాడివా, పేదవాడివా?" "తమరన్నది నిజమే గానీ - ఇది పరుసవేది అనీ, ఇది నా ఇంట్లో ఉందనీ నాకు తెలియదుగదా స్వామీ!" అన్నాడు రంగన్న బుర్ర గోక్కుంటూ.

సాధువు మెల్లగా నవ్వాడు. "నీకే కాదు రంగన్నా లోకంలో చాలా మందికి ఈ సత్యం తెలియదు. మనందరిలోనూ ఒక పరుసవేది ఉంటుంది. దాన్ని తాకితే చాలు-మన బ్రతుకులన్నీ బంగారం అయి పోతాయి. కానీ మనం దానివైపే చూడం. ఏదో కష్టం కలిగినప్పడు కాస్సేపు అనుకొంటామేగానీ-ఏకాగ్రచిత్తంతో దానిని తాకం. బయట బయటే ఆలోచిస్తాం. బయటి కష్టాలు చూచే ఏడుస్తాం. బయటి సంపదలు, కీర్తి,





చదువు చూచుకొనే పొంగిపోతాం. తుప్ప పట్టిన ఇనుమునే జాగ్రత్తగా కాపాడుకొంటాం. అంతేగానీ మన లోపల ఉన్న పరుసవేదిలాంటి భగవంతుడిని మర్చిపోతాం. ఆయనను తాకితే చాలు ధన్యులమైపోతామని తెలుసుకోము.


నీ సంగతి కూడా అంతే. నీకు కష్టం వచ్చిందని దుఃఖపడుతున్నావు. సాయం చేసే దిక్కులేదని ఏడుస్తున్నావు. అందరికన్నా ఎక్కువ సహాయ పడగలవాడిని తలుచుకోవటమే లేదు. నువ్వే చెప్పు. నీవు ఒక రాయి కుక్క మీదికి విసిరావు. అది దానికి తగిలింది. ఆ కుక్క నిన్ను చూచి మొరుగుతుందా, రాతిని చూచా? నిన్న చూచే మొరుగుతుంది. అలాగే మనకు కష్టాలిచ్చేవాడు భగవంతుడు. అవి తీర్చమని ఎవరినడగాలి? ఆ కష్టం యిచ్చిన వాడినా-కష్టాన్నా? ఇప్పుడు అర్థమైందా, నీ పొరపాటేమిటో, నీ లోపల ఉన్న పరమాత్మ మీద చూపు నిలుపు-ఓర్పుతో ఉండు. నీ కష్టం ఆయనే తీరుస్తాడు. అదే నీకు తెలియవలసిన సత్యం" అన్నాడు సాధువు.

రంగన్న నమస్కరించాడు ఆయనకు. "స్వామీ! నా కళ్లు తెరిపించారు. చాలా అదృష్టవంతుడిని నేను. తమవంటి మహానుభావులు వెతుక్కుంటూ వచ్చి నాకు ధర్మోపదేశం చేస్తారు. ఈ పరుసవేది తమ దగ్గరే ఉంచండి. నాలాగా కష్టాలలో ఉన్న వారికి సాయపడండి. నాకు మీరు చేసిన యీ బంగారమే చాలు" అన్నాడు. సాధువు "అదేమిటి రంగన్నా! ఇది నీ ఇంటి లోనిదే గదా!" అని అడిగాడు. రంగన్న నవ్వాడు. "నన్ను పరీక్షిస్తున్నావా స్వామీ! అవసరం కన్నా ఎక్కువ సంపద సమకూరితే బుద్ధి చెడిపోతుందని మా నాన్న చెప్పేవాడు. మితిమీరిన డబ్బుతో సోమరితనం, నిర్లక్ష్యం, ఇతరుల పట్ల చులకనభావం, గర్వం-ఇంకా ఎన్నెన్నో చెడ్డ లక్షణాలు వస్తాయని చెప్పేవాడు. అయినా, నా లోపలే పెద్ద పరుసవేది ఉంటే యిది నాకెందుకు స్వామీ!" అంటూ రంగన్న దాన్ని సాధువు జోలెలో "కృష్ణార్పణమ్" అంటూ వేసేసాడు. అతన్ని ఆశీర్వదించి సాధువు లోకోపకారం కోసం మళ్లీ తన ప్రయాణం సాగించాడు.



ఓం శ్రీ సాయిరాం

జై గురుదత్త    శ్రీ గురుదత్త



# గురుపూర్ణిమోత్సవం



**జూలై 1. 2. 3 తేదీలలో 2023**

**సాయిదత్త పీఠం, సాయిధామం, పెద్ద పర్వతాపురం గ్రా,**

**బొమ్మల రామవరం మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా-508126**

**చరవాణి : 9440413455, 9848133565**

## శ్రీ దత్తత్రేయ, సాయిబాబా మందిరాల 27వ వార్షికోత్సవం

**ప్రియ మిత్రులందరికీ శ్రీ సాయిరక్ష.**

ఎఱుక(జ్ఞానం) గలవారు గురువులైతే మరుపు గలవారు అజ్ఞానులైన శిష్యులు. అప్పుడప్పుడూ ఎండముఖం చూపించక పోతే ఏ వస్తువు అయినా బూజుపడుతుంది. అలాగే మనం కూడా అప్పుడప్పుడూ గురు దర్శనం చేసుకుని వారి వాగమృతంతో తమలో పేరుకుపోతున్న విషయవిషాన్ని విరగొట్టుకోవడం వారి దృష్టిపాతంతో అజ్ఞానావరణను కాల్చి వేసుకోవడం చాలా అవసరం. అంచేత మిత్రులారా శోభకృత్ నామ సంవత్సరం ఆషాఢ పూర్ణిమ (గురుపూర్ణిమ) జూలై 3, 2023న మన సాయి ధామంలో కొలువైన శ్రీ సాయిబాబా వారిని, శ్రీ దత్తాత్రేయ స్వామి వారిని దర్శనం చేసుకుందాం. ద్వారవతిలోకి శ్రీ సాయి, శ్రీ దత్తులు వేంచేసి 27 సం.లు పూర్తయిన వేళ వారిని మనసారా అర్చించుకుందాం. అటుపైన మనకు జ్ఞాన వాకిళ్ళు తెరిచిన ఆశ్రమ వ్యవస్థాపకులైన పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ మహారాజుల వారిని, అమ్మ మాతాజీ దర్శనభాగ్యం పొందుదాం. దిగువ ఈ మూడు రోజులు కార్యక్రమాలన్నిటినీ ఈ విధంగా జరుపుకుందాం.



## కార్యక్రమ వివరాలు

### 01.07.2023 – త్రయోదశి–శనివారం :

ఉదయం 5.15 సాయినాథుల వారికి కాకడ హారతి

6.00 దత్తత్రేయ స్వామి వారికి క్షీరాభిషేకం

8.00 సాయిమారుతికి తమలపాకులతో అష్టోత్తర శతనామ పూజ

9.00 ధ్వజారోహణ, ప్రార్థన

10.00 దత్తాత్రేయ చరిత్ర పారాయణ ప్రారంభం

మధ్యాహ్నం 12.00 మధ్యాహ్న హారతి

సాయంత్రం 5.00 పారాయణం ముగింపు

6.15 సాయంకాల హారతి

7.00 సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ, భజన

రాత్రి 9.00 శేజారతి

### 02.07.2023 – చతుర్దశి–ఆదివారం :

ఉదయం 5.15 సాయినాథుల వారికి కాకడ హారతి

6.00 శ్రీ సాయినామం అర్ధ ఏకాహ ప్రారంభం (ఓం సాయిరాం శ్రీ సాయిరాం జయ జయ సాయిరాం జయ సాయిరాం)

**ఏకాహంలో పాల్గొంటున్న భజన మండళ్ళు :** 1.శ్రీరామ భజన బృందం, ఉద్దమర్రి, 2. శ్రీరాధా రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి భజన మండలి, పెద్ద పర్వతాపురం, 3. శ్రీ సీతారామాంజనేయ భజన భక్త బృందం ఫకీర్‌గూడెం, 4. శ్రీరామ భక్త బృందం, బొమ్మలరామారం, 5. భక్తాంజనేయ స్వామి భజన మండలి మల్యాల, 6. శ్రీ హరిహర భజన బృందం, మూడు చింతలపల్లి.

సాయంత్రం 6.00 గం.లకు అర్ధ ఏకాహం సమాప్తి

6.20 సాయంకాల హారతి

7.00 భజన, సామూహిక సాయిచాలీసా పారాయణ

9.00 శేజారతి

## 03.07.2023 సోమవారం - గురుపూర్ణిమ

ఉదయం 5.15 సాయినాథుల వారికి కాకడ హారతి
6.00 సాయికి పంచామృతాలతో క్షీరాభిషేకం
7.00 సహస్ర ఘంటాభిషేకం
9.00 గురు పాదుకా పూజ (జ్ఞానధామంలో)
9.30 సురభి గోశాల 'ఉగ్రాణం' ప్రారంభోత్సవం
10.00 సహస్ర నామంతో వివిధ పుష్పాలతో లక్ష పుష్పార్చన
11.45 ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి ప్రవచనం
12.00 మహా హారతి, గురుదక్షిణ సమర్పణ
12.30 పల్లకీ సేవ
01.00 అన్నప్రసాద వితరణ

జూలై, 3, 2023 తేదీన (శ్రీ సాయి సహస్ర నామంతో) లక్ష పుష్పార్చనకు రూ.116/-లు దక్షిణగా నిర్ణయింపబడింది. రాలేని వారు తమ గోత్రనామాలతో దక్షిణ చెల్లిస్తే పూజ వారి పేరిట నిర్వహించబడుతుంది. పై ఉత్సవాలలో అన్నదానానికి గానీ, అలంకరణకుగానీ, మరే విధంగా గానీ సహకరించు దల్చుకున్న భక్తులు తమ సహకారాన్ని **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ పేరిట చెక్కు ద్వారా కానీ, వ్యక్తిగతంగా గానీ ఈ ఫోన్‌కు 9848133565 నెంబర్‌కు గూగుల్ పే కానీ, ఫోన్ పే కానీ ఆన్‌లైన్‌లో చెల్లించి సెక్షన్ 80జి రాయితీ రశీదు పొందవచ్చును.**

పై కార్యక్రమాలన్నింటిలో ఉత్సాహంగా పాల్గొనవలసిందిగా ఇదే మా ఆహ్వానం.

**రండి - గురుదేవుల ఆశీస్సులు అందుకోండి - తరించండి**

ఇట్లు,

**ఉత్సవ సమితి,**
**శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్,**
**సాయిధామం.**





# మాతృసంస్థ కబుర్లు

మే 9వ తేదీనాడు సాయి దత్త పీఠం, సాయిధామం సేవాశ్రమం పరిసర గ్రామమైన బొమ్మల రామవరం మండలంలోని మల్యాల గ్రామంలో గ్రామస్తుల ఆహ్వానం మేరకు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ హనుమత్ శోభాయాత్ర, హనుమత్ మందిర భూమి పూజ మరియు తల్లిదండ్రుల పూజా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. స్వామీజీ వారి ప్రవచనంలో హనుమంతుని యొక్క భక్తి, యుక్తి, శక్తిని గూర్చి వివరించారు. ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రుల పట్ల పిల్లలు ఎలాంటి ప్రవర్తనను కలిగి వుంటున్నారో వివరించారు. తల్లిదండ్రులు, పిల్లలకు ఇవ్వవలసిన నిజమైన ఆస్తులు మంచి విద్య, సంస్కారం, మానవత్వం వంటి విలువలు ఇవ్వండి, ఆస్తులే కాదు అని వివరించారు. ధర్మ పరిరక్షణ జరగాలంటే యువకులంతా ఐకమత్యంతో కృషి చేయాలని కోరారు.

మే 11వ తేదీ కోస్గిలోని నారాయణ్‌పేట్ దగ్గర మారేపల్లి శ్రీనివాస రెడ్డి, భారతిగార్ల ఆహ్వానం మేరకు నూతన గృహ ప్రవేశానికి వెళ్ళి సాయి ప్రసాదాన్నీ, గురుదేవుల ఆశీస్సులను అందించారు.

మే 12వ తేదీ గుంటూరు జిల్లా మైనేనివారి పాలెం, శ్రీసాయినాథ క్షేత్రంలో సర్వతోభద్ర సాయి దేవాలయం 17వ వార్షికోత్సవం శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగింది. శ్రీ సాయినాథుల వారికి సహస్ర నామార్చన సామూహికంగా జరిగింది. అనంతరం అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఊరివారంతా సహాయసహకారాలు అందించి, బాబా వారి ఆశీస్సులు పొందారు.

మే 14వ తేదీ సాయిదత్త పీఠం సాయిధామం సేవాశ్రమ పరిసర

గ్రామమైన ఉద్దమర్రి గ్రామంలో ఆలయ ధర్మకర్తల ఆహ్వానం మేరకు శ్రీ విష్ణు, శ్రీ శివాలయం, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో, శ్రీనివాస కళ్యాణ కార్యక్రమంలో సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు పాల్గొనడం జరిగింది.

జూన్ 4 జ్యేష్ఠ పౌర్ణమి నాడు సాయిధామం ద్వారవతి సాయి దేవాలయంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ జరగాలని శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు సంకల్పించారు. సకల మానవాళి ధర్మమార్గాన్ని అనుసరించాలీ, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ జరగాలీ, ఆశ్రమం నిత్యకళ్యాణం పచ్చతోరణంగా వెలుగొందాలనీ వారి తపన.

స్వామి సంకల్పం నెరవేరకుండా ఉంటుందా-గురుదేవులు అను గ్రహించకుండా ఉంటారా! అనుకున్నట్లుగానే ఆశ్రమ దర్శనార్థం వచ్చిన శ్రీ రాజగోపాల నాయుడు గారితో వెలిబుచ్చగా తప్పకుండా స్వామీ ఎప్పుడు చెయ్యమంటారు అంటే - పౌర్ణమినాడు అని చెప్పగా భజన బృందంతో, చక్కటి గాత్రంతో శ్రీ హనుమాన్ చాలీసా సామూహికంగా 108 సార్లు పారాయణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి ప్రజలు, హనుమత్ భక్తులు, ఆశ్రమ శ్రేయోభిలాషులు, గురువుగారి శిష్యులు అందరూ పాల్గొన్నారు. ప్రతి చాలీసా అనంతరం స్వామికి హారతి, నివేదన జరిగింది. వచ్చిన భక్తులందరికీ మధ్యమధ్యలో మంచినీరు, మజ్జిగ, రాగి జావ, పానకంలతో దాహార్తిని తీర్చారు.

ఈ కార్యక్రమానికి సందర్శనార్థం విచ్చేసిన సాయిశ్రీ ప్రింటర్స్ అధినేత అయిన శ్రీ వీరమాచనేని వెంకట కృష్ణారావు దంపతులు - వచ్చిన అతిథులందరికీ కూడా బాబా వారి వస్త్రంతో సత్కరించారు. భక్తులందరూ గుండెల నిండా భక్తితో, మనస్సు నిండా సంతోషంతో ఆశ్రమాన్ని, ఆశ్రమ పరిసరాలను పరికించి కొనియాడారు. ఆశ్రమానికి విచ్చేసిన భక్తులందరికీ ఆశ్రమ సేవా కార్యక్రమాలు, ఆశ్రమ వాతావరణం మానసికోల్లాసం





కలిగించాయని వెలిబుచ్చారు. అనంతరం స్వామి వారి ఆశీర్వచనాలు తీసుకుని, అన్నప్రసాదం స్వీకరించి ఆనందంతో తరలివెళ్ళారు.

మే 10వ తేదీ పనులు ప్రారంభించిన సురభి గోశాల ఉగ్రాణం నిర్మాణ పపనులు చకచకా సాగుతున్నవి. గోమాతల కోసం నిర్మాణంలో దాత లందరూ తమ శక్తి మేరకు సహకరించి గోమాత ఆశీర్వాదం పొందాలని గోమాత ప్రేమికులను సాయివాణి మనసారా కోరుకుంటుంది.

జూన్ 18 అమావాస్య సందర్భంగా సాయిధామం ఆశ్రమంలో గోపూజా కార్యక్రమం వైభవంగా జరిగింది. చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని, గోమాత విశిష్టతను స్వామీజీ ద్వారా విని తరించారు.

జూన్ 19వ తేదీ సాయిధామం పరిసర గ్రామమైన బొమ్మల రామవరం మండలంలోని తెలంగాణా మోడల్ స్కూల్ మరియు జూని యర్ కళాశాల ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకుల ఆహ్వానం మేరకు తెలంగాణా దశాబ్ది ఉత్సవాలలో స్వామీజీ వారు పాల్గొని పిల్లలకు విద్య, సభ్యత, సంస్కారం, క్రమశిక్షణ విద్యార్థులు అలవరుచుకోవలసిన లక్షణాలను బాలబాలికలకు చక్కటి కథల రూపంలో వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీమతి శోభారాణిగారు మాట్లాడుతూ స్వామీజీ వారు మా ఆహ్వానాన్ని మన్నించి మా పాఠశాల, కాలేజీకి రావడం మేము చేసుకున్న సౌభాగ్యమనీ స్వామీజీ చెప్పిన విషయాలు జీవితంలో పాటించి ప్రతిభావంతులు, ప్రజ్ఞావంతులు కావాలనీ, ఈ విద్యా సంవత్సరం ఒక మహనీయుని ఆధ్యాత్మిక ప్రబోధంతో, ఆశీస్సులతో ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందనీ, తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. అనంతరం స్వామీజీని పండ్లతో సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వామీజీతోపాటు ఆశ్రమ ట్రస్టు సభ్యులైన డా॥ జి.చంద్రారెడ్డి గారు పాల్గొన్నారు.